జాబ్‌మేళాలో 74మంది ఉద్యోగాలకు ఎంపిక

విశాలాంధ్ర-విజయనగరం: ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐలో నిర్వహించిన జాబ్ మేళా విజయ వంతంగా ముగిసింది. ఈ జాబ్‌మేళాలో హెటిరోడ్రగ్స్, ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ఇండియా వంటి కంపెనీలు ఇంటర్వ్యూలను నిర్వహించాయి. ఈఎంపికలకు మొత్తం 167మంది నిరుద్యోగ యువకులు హాజరుకాగా వారిలో 74మందిని ఎంపిక చేయడం జరిగింది. ఈఇంటర్వ్యూలలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు వేతనం రూ.13వేలనుంచి 25వేలవరకు ఇవ్వడం జరుగుతుందని వివరించారు. ఈ జాబ్‌మేళాలలో ముఖ్య అతిథిలుగా ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్, జిల్లా ఐటిఐ కన్వీనర్ టివి.గిరి, ఎపి జిల్లా నైపుణ్యాబివృద్ధి అధికారి జి. ప్రశాంత్‌కుమార్, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి డి. అరుణ, ప్లేస్‌మెంట్ అధికారి కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండగ లో పనులన్నీ డిసెంబరు 15 లోగా పూర్తి కావాలి

– అధికారులతో కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

– ప్రగతి తక్కువగా ఉన్న ఎంపిడిఓ ల పై ఆగ్రహం

విశాలాంధ్ర-విజయ నగరం: పల్లె పండగ కార్యక్రమం కింద మంజూరైన పనులన్నింటినీ డిసెంబర్ 15 లోపల పూర్తి చేయాలని కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్ తెలిపారు. ఈ కార్యక్రమం కింద చేపడుతున్న సిసి రోడ్లు, కాటిల్ షెడ్స్ తదితర పనులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల వారీగా బుధవారం సమీ క్షించారు. పంచాయతీ రాజ్ ద్వారా 2203 పనులు మంజూరు కాగా 1407 పనులు గ్రౌండ్ అయ్యాయని, 61 పనులు పూర్తయ్యాయని, 6 పనులకు మాత్రమే బిల్లులను సమర్పించారని తెలిపారు. పనులు వేగంగా జరగాలని, పూర్తిచేసిన బిల్లులను వెంటనే సబ్మిట్ చేయాలని ఆదేశించారు. తక్కువ ప్రోగ్రెస్ ఉన్న మండ లాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గుర్ల తప్ప మిగిలిన మండలాలన్నీ వెనకబడి ఉన్నాయని, ఇదే పరిస్థితి కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంతవరకూ మొదలు పెట్టని పనులను ప్రస్తుత వెండర్ ను రద్దు చేసి కొత్త వెండర్ తో పనులు మొదలు పెట్టాలని సూచించారు. కాటిల్ షేడ్స్ జిల్లాలో 858 మంజూరు కాగా 386 గ్రౌండింగ్స్ అయ్యాయని, వీటిని త్వరగా పూర్తి చేసి బిల్లులను సమర్పించాలని ఆదేశించారు. మిగిలిన వాటిని సత్వరమే ప్రారంభించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా పరిషత్ సిఈఓ సత్యనారాయణ, డ్వామా పిడి కల్యాణ చక్రవర్తి, పంచాయతీ రాజ్ ఎస్.ఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులతో స్నేహపూర్వకంగా మెలగండి

రుణాలు క్లైమ్ ల పరిష్కారానికి చొరవ చూపండి

ఏపీ జీఎల్ఐ సంచాలకులు రెడ్డి శ్రీనివాస్

విశాలాంధ్ర-విజయనగరం: సహ ఉద్యోగుల పట్ల, ఇతర శాఖల అధికారులు ఉద్యోగుల పట్ల ఏపిజిఎల్ఐ అధికారులు సిబ్బంది స్నేహపూర్వకంగా మెలగాలని ఏపిజిఎల్ఐ రాష్ట్ర సంచాలకులు రెడ్డి శ్రీనివాస్ హితబోధ చేశారు. బుధవారం మంగళగిరి ప్రధాన కేంద్రం నుండి విజయనగరం చేరుకున్న సంచాలకులు విజయనగరం ఏపిజిఎల్ఐ కార్యాలయంకు చేరుకొని తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది హాజరుకు సంబంధించి ఎఫ్ ఆర్ ఎస్, హాజరు పట్టీ, ఇతర రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్త పరిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ, ఏపీజీఎల్ఐ లో అధికారులు సిబ్బంది అందరూ కలిసిమెలిసి ఒకే కుటుంబ సభ్యులుగా ఉండాలని, ఇతర శాఖల అధికారులు, సిబ్బందికి ఏపిజిఎల్ఐ అందిస్తున్న సేవలు పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. ఏపిజిఎల్ఐ రుణాలు క్లైములు పరిష్కారంలో చొరవ చూపించాలని ఆదేశించారు. అదేవిధంగా పాలసీలకు సంబంధించి ఎవరికైనా అనుమానాలుంటే నివృత్తి చేయాలని ఆదేశించారు. ఏపీజీఎల్ఐ పాలసీ పెంచుకునే వెసులుబాటును కల్పించిన విషయాన్ని అవగాహన పరచాలన్నారు. అనంతరం శ్రీకాకుళం జిల్లా ఎపిజెఎల్ఐ కార్యాలయం తనిఖీకి బయలుదేరి వెళ్లారు. ముందుగా విజయనగరం చేరుకున్న సంచాలకులు రెడ్డి శ్రీనివాస్ స్థానిక పైడితల్లి అమ్మవారి దేవాలయం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం తరపున పూర్ణకుంభంతో ఇన్కమింగ్ స్వాగతం పలికిన అర్చకులు తీర్థ ప్రసాదాలను, ఆశీర్వాదాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కేంద్రం సహాయ సంచాలకులు సహాయ సంచాలకులు ఏ ఆర్కే నాయుడు, విజయనగరం సహాయ సంచాలకులు జి హైమావతి, పర్యవేక్షకులు కరుణ, సుధారాణి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ వైద్య విధానాలపై ఆశా కార్యకర్తలకు శిక్షణ

విశాలాంధ్ర-పూసపాటిరేగ: ఆయుష్ ద్వారా ఆరోగ్యం పై డాక్టర్ లక్ష్మీ శైలజ, హోమియోపతి వైద్యురాలు, ప్రభుత్వ హోమియో వైద్యశాల, పూసపాటిరేగ. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయుష్ విభాగం, జాతీయ ఆయుష్ మిషన్ వారి సహకారంతో పూసపాటిరేగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ రాజేష్ వర్మ అధ్యక్షతన ఆయుష్ వైద్య విధానంపై ఆశా కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం బుధవారం జరిగింది. స్థానిక హోమియోపతి వైద్యులు లక్ష్మీ శైలజ పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఆరోగ్యకర జీవితం కోసం జీవనశైలిలోమార్పులు అవసరమని గ్రామస్థాయిలో ఆశా కార్యకర్తలు గృహ వైద్యాన్ని ప్రోత్సహించాలని, ఔషధ మొక్కల పెంపకం, ఎవరికైనా అనారోగ్యం కలిగినప్పుడు ఔషధ మొక్కలతో గృహ వైద్యం చేయగలగాలనీ సాధారణ వ్యాధులతో పాటు మధు మేహ రోగులకు ఏమి చెయ్యాలి ఏమి చేయకూడదు అనే విషయాలపై వివరించారు. ఆయుష్ వైద్య విధానాలతో పాటు పేరొందిన అనేక చికిత్స పద్ధతులపై సమాజంలోని ప్రజలను చైతన్యవంతులను చేస్తే ఆయుష్ ద్వారా ఆరోగ్యం ప్రాప్తించునని తెలియజేశారు. దీనికి సంబంధించిన పుస్తకాలను పాంప్లెట్స్‌ను పంచారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వేదమని, హెల్త్ ఎడ్యుకేటర్ మహేశ్వరి, సూపర్వైజర్లు ఉమాపతి,నానమ్మ, ఆరోగ్య సహాయకులు ఆర్ వి రమణ పాల్గొన్నారు.

శీతల గిడ్డంగుల ఏర్పాటుకు కృషి

గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ గిడ్డంగులను జిసిసి చైర్మన్ కిదారి పరిశీలన

విశాలాంధ్ర-శృంగవరపుకోట టౌన్: జిసిసి గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ గిడ్డంగులు పరిశీలించడానికి ఎస్ కోట విచ్చేసిన జిసిసి చైర్మన్ కిదారి శ్రావణ్ కుమార్. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్.కోట కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శృంగవరపు కోట మండల కేంద్రంలో ఉన్న గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ గిడ్డంగలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో తమకు జిసిసి చైర్మన్‌గా అవకాశం కల్పించారు అని ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ మంత్రి ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమ శాఖ జీసీసీ బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. జిసిసి పరిధిలో ఉన్న గిడ్డంగులను మొత్తంగా శిథిలావస్థలో ఉన్న వాటిని పర్యవేక్షించారు. అవసరమైన చోట గిడ్డంగులు మరమ్మత్తులు మరియు నూతన గిడ్డంగులు ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అలాగే గిరిజన ఉత్పత్తులు సేకరించడమే కాకుండా వాటిని బాహ్య ప్రపంచానికి తెలియజేసే విధంగా జిసిసి బాధ్యత వ్యవహరి స్తుందనీ అన్నారు. యస్.కోట కార్పొరేషన్ భవనాలు చాలా కాలం నుండి నిరుపయోగంగా ఉండటంతో శిథిలా వస్థకు చేరుకొన్నాయి. గిడ్డంగులు మరమ్మతులు చేయించి ఖాళీ ప్రదేశంలో కోల్డ్ స్టోరేజ్‌లో ఏర్పాటుచేసి మన్యం ప్రాంత వాసులకు, ఎస్ కోట వాసులకు ఉపయోగకరంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. నిరుపయోగంగా ఉన్న వాటిని ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దాతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అనంతగిరి మండల అధ్యక్షుడు బుజ్జి బాబు, ఎస్.కోట టిడిపి మండల పార్టీ అధ్యక్షులు జిఎస్ నాయుడు, జిసిసి డైరెక్టర్ దాసరి లక్ష్మి, ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి చెక్క కిరణ్ కుమారు, జిసిసి మేనేజర్ మురళి, సూపర్డెంట్ హేమ, సేల్స్ మాన్ అప్పల దొర, ముత్యాలు, అప్పలస్వామి, శంకర్, అప్పన్న దొర, మహిళా నాయకులు సుశీల, రాష్ట్ర ఎస్సి సెల్ ఆర్గనైజేషన్ కార్యదర్శి నిర్మల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-లక్కవరపుకోట: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు జరిగాయని శాఖ గ్రంథాల య అధికారి బీ మేరీ నిర్మల బుధవారం తన కార్యాలయంలో తెలిపారు ఈ వారోత్సవాల్లో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడవరోజు గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు డాక్టర్ ఎస్ ఆర్ రంగనాథన్, పాతూరు నాగభూషణం, మొదలైన ప్రముఖులను స్మరించారు. నాలుగవ రోజు కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితలు సందేశాలు, 5వ రోజు విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ క్రీడల పోటీలు, 5వ రోజు మహిళలకు రంగవల్లులు, అల్లికలు పోటీలు నిర్వహించడం జరిగిందని, ఆరవ రోజు విజేతలకు బహుమతులు ప్రధానం వారోత్సవాలు ముగింపు వేడుకలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ విద్యార్థుల విద్యార్థులు ఉపాధ్యాయులు, కేజీబీవీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

పాడిపరిశ్రమ అభివృద్ధికై అసెంబ్లీలో గళం విప్పిన ఎమ్మెల్యే కోండ్రు

విశాలాంధ్ర-రాజాం: మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ బుధవారం అసెంబ్లీ సమావేశంలో తన గళాన్ని వినిపిస్తూ నియోజకవర్గంలో ప్రధానమైన పాడిపరిశ్రమ సమస్యలపై వివరించారు. నియోక వర్గంలో పది ఆసుపత్రులు ఉంటే కేవలం ఎనిమిది మంది మాత్రమే వైద్యులు ఉన్నారు. వైద్యుల కొరత వేదిస్తోందన్నారు.నియోజకవర్గంలో 40 వేల పైబడి ఉన్న పశువుల పెంపకంలో కనీసం 20వేల లీటర్లు పాలు వచ్చేపరిస్థితి లేదు.దాణా ఖరీదు 50-60 రూపాయలు అధికంగా ఉంది.ప్రభుత్వం దీనిపై దృష్టిసారించి సబ్సిడీ పై అందజేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ లకు సబ్సిడీపై పశువుల షెడ్లు.దానాలు కేటాయించాలన్నారు.పశువులు గొర్రెల పెంపకంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

అనధికార కట్టడాలు తొలగింపు

కమిషనర్ పల్లి నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: అనధికార కట్టడాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించ బోమని విజయనగరం నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టంచేశారు. ఆయన ఆదేశాలతో బుదవారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సిబ్బంది పలు ప్రాంతాలలో పర్యటించి అనధికార నిర్మాణాలను, ఆక్రమిత షెడ్డులను తొలగించారు. కోలగట్ల వారి వీధిలో గృహ అవసర నిర్మాణానికై అనుమతిని తీసుకొని తదనంతరం వ్యాపార సముదాయంగా మార్చుదాన్ని ప్రణాళిక సిబ్బంది గుర్తించారు. సదరు భవనం డివియేషన్ కు గురైనట్లు గమనించి రెండుసార్లు ప్రణాళిక విభాగం సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. గృహ సౌకర్యానికై అనుమతి తీసుకుని వ్యాపార సముదాయంగా మార్చకూడదని రెండుసార్లు భవన యజమానికి నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో ఈరోజు భవనానికి నిర్మించిన గోడలను తొలగించి వేశారు. అలాగే పెద్ద చెరువు ప్రాంతంలో రామారాయుడు రహదారిలో వేసిన తాత్కాలిక ఆక్రమణలు తొలగించి వేశారు. ఎన్సియస్ రోడ్డులో తాత్కాలిక షెడ్డులు వేసుకొని వ్యాపారాలు చేస్తున్న వారిని అక్కడ నుంచి తరలించి వేశారు. ఈ నేపథ్యంలో కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ఇప్పటికే పలుమార్లు ఆక్రమితదారులకు హెచ్చరించామని మరల ఎక్కడైనా అనుమతులు నిరాకరించి నిర్మాణాలు జరిపినా, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినా నిర్దాక్షిణ్యంగా తొలగించి వేస్తామని స్పష్టం చేశారు.

సీతంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు



విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక గాజులరేగ పరిదిలో గల సీతం కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా స్థానిక పట్టణంలో గల శిశుసంరక్షణ కేంద్రంనకు వెళ్ళి విద్యార్థులు అందరికి నీతి కథలుఅను పుస్తకాలు, నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్లు, బిస్కెట్లు చాక్లెట్లు పంచిపెట్టారు. దీనిలో భాగంగా కళాశాలలో పుస్తక ప్రదర్శన, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బాలల హక్కుల కమీషన్ చైర్మన్ డా. కేసలి అప్పారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనంను అలవర్చుకోవాలని, పాఠశాలలో ఉన్న గ్రంథాలయమును సందర్శించి జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకుంటూ లక్ష్య సాధన వైపు అడుగులు వేయాలని హిత బోధ చేశారు. కళాశాల డైరెక్టర్ డా. మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ తమ బంగారు భవిష్యత్తుకు మంచి బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. డి.వి. రామమూర్తి, గ్రంధాలయా ధికారిణి డా. సత్యవతి, కెప్టెన్ ఎం. సత్యవేణి, లెఫ్టినెంట్ ప్రశాంత్, వివిధ విభాగదీపతులు, అధ్యాపకులు, గ్రంధాలయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో నారాయణ పబ్లిక్ పాఠశాల విద్యార్థులకు బహుమతులు



విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గురజాడ జిల్లా గ్రంథాలయం నిర్వహించిన క్విజ్‌పోటీలలో స్థానిక గాజులరేగ పరిధిలోనున్న నారాయణ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు జూనియర్ విభాగంలో ద్వితీయస్థానంలో ఎం జస్వంత్, సిహెచ్ సిద్ధార్థ నాయుడు, సబ్ జూనియర్స్ విభాగంలో తృతీయ స్థానంలో ఎం హేమ పార్వతి, టి నవ్యశ్రీ, ఎం సాత్విక్, గెలుపొందారు వీరికి పాఠశాల కరస్పాండెంట్ మొయిద నారాయణరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

విజయవంతంగా గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-గుర్ల: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా గుర్ల శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి పి. రామారావు ఆధ్వర్యంలో ఈరోజు ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గుర్ల ఎస్ఐ నారాయణరావు మదర్‌తెరిస్సా ఫౌండేషన్ అధ్యక్షులు టివియస్. ఎన్. ప్రసాద్ రావు, మాతృభూమి సేవా సంఘం అధ్యక్షులు ఐ.గోపాలరావు, ఎన్‌విఎన్. బ్లడ్ బ్యాంక్ అధ్యక్షులు, టి.వి.ఎల్. ఎస్.నాగేశ్వరరావు కేజీబీవీ ఎస్ఓ జానకి, ఫుడ్ విజిలెన్స్ పద్మలత ,గుర్ల హైస్కూల్ చిన్నాదేవి విద్యార్థులు, పెద్దలు పాల్గొన్నారు.

11 కేవి సోలార్ ప్లాంట్ల నిర్మాణానికి స్థల పరిశీలన



విశాలాంధ్ర-తెర్లాం : మండలంలోని డి. గదబవలస, సతివాడ గ్రామాల్లో జాయింట్ కలెక్టర్ వారి ఆదేశాలు మేరకు తహసీల్దార్ హేమంత్ కుమార్, సిబ్బంది, డి. గదబవలస గ్రామ సర్పంచ్ రమేష్‌తో పిఎం కుసుమ్ ప్రాజెక్ట్ కింద 11 కే వి సోలార్ ప్లాంట్స్ నిర్మించుట కొరకు బుధవారం స్థల పరిశీలన చేసినట్టు తహసీల్దార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తంతి తపాలా సేవలు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-శృంగవరపుకోట రూరల్ : శృంగవరపు కోట మండల పరిధిలో పోస్టల్ సేవలను, ప్రయోజనాలను, ప్రజలు వినియోగించుకోవాలి. విజయనగరం జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసు మండల పరిధిలో పోస్టల్ శాఖ నిర్వహిస్తున్న నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ)- డిబిటి)డైరెక్ట్ బెన్ఫిసీయర్ ట్రాన్స్ఫర్ మ్యాపింగ్ ప్రత్యేక క్యాంపులను పరిశీలించారు . ప్రతి గ్రామంలో ప్రజల సౌకర్యార్థం డీబీటీ మ్యాపింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనివల్ల ప్రభుత్వ పథకాల లావాదేవీలు తపాలా ద్వారా ప్రజలకు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ సందర్భంలో చప్ప మౌనికకు తపాలా జీవిత భీమా డెత్ క్లెయిమ్ బెనిఫిట్స్ 12 లక్షల రూపాయలను అందజేస్తూ తపాలా సేవలను అందరు వినియోగించుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో సిబ్బంది వినోద్ కుమార్ పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి పాటుపడాలి

కమిషనర్ పల్లి నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: పన్నులను సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పాటు అందించాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు బుదవారం నగరంలో మొండిబకాయలను వసూలు చేసేందుకు సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు నేతృత్వంలో సిబ్బంది విస్తృతంగా పర్యటించారు. కే.ఎల్ పురం, బాలాజీ మార్కెట్ ప్రాంతాలలో మొండి పన్ను బకాయిలు ఉన్న దుకాణాలకు వెళ్లి పన్నులు రాబట్టేందుకు ప్రయత్నించారు. పన్నులు కట్టేందుకు దుకాణదారులు సమ్మతించడంతో ఇంటి పన్ను, కుళాయి పన్ను, పాత, కొత్త ఐడీఎస్ యంటి షాపింగ్ కాంప్లెక్స్ అద్దెబకాయలు వసూళ్లకు ఉపక్రమించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ నగరంలో ఆస్తి, ఖాళీ స్థలములు, నగరపాలక సంస్థ ఆధీనంలో ఉన్న దుకాణ సముదాయాలు, కుళాయి పన్నులు, ప్రకటన పన్నులను సంబంధిత వ్యక్తులు తక్షణమే చెల్లించాలని తెలిపారు. మొండిబకాయలను ఎట్టి పరిస్థితులలోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అద్దె బకాయిలు ఉన్న దుకాణాలను తాళాలు వేస్తున్నామని చెప్పారు. ముందుగా చాలాకాలంగా మొండి బకాయిలు ఉన్న వందమంది జాబితాను సిద్ధంచేసి వారి నుండి పన్నులను రాబడుతున్నామన్నారు. రెవెన్యూ వసూళ్ళకై తాము చేపట్టిన ప్రత్యేక కార్యచరణకు మొండి బకాయిదారులు స్పందించి పన్నులను చెల్లిస్తున్నారని స్పష్టం చేశారు.

సమగ్ర నైపుణ్యాభివృద్ధి సర్వే వేగవంతం చేయండి

మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి

విశాలాంధ్ర-బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న సమగ్ర నైపుణ్యాభివృద్ధి సర్వే సంబంధిత రెవిన్యూ మున్సిపల్ మెప్మా సిబ్బంది సర్వే వేగవంతం చేయాలని సర్వేలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ఆదేశించారు.పురపాలక సంఘం కౌన్సిల్‌హాల్ లో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి హాఆధ్వర్యంలో 16 సచివాలయాలలో సెక్రెటరీ లందరికి సమగ్ర నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి మాట్లాడుతూ పట్టణంలో గల 15 -59 సం.వయస్సు గల వారందరికీ సర్వే చేయు నిమిత్తం నైపుణ్యం ఆప్ ద్వారా తమ క్లస్టర్ పరిధిలో ప్రతీ కుటుంబంలో ఉన్న అర్హులైన వారిని గుర్తించి సర్వేలో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సర్వేను ప్రతిష్ఠాత్మకంగా క్వాలిటీతో ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సకాలంలో సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి తెలియజేశారు. కార్యక్రమంలో టౌన్ ప్రాజెక్టు అధికారి యం.జగన్మోహనరావు, మునిసిపల్ మేనేజర్ పివిటి రాఘవాచార్యులు, మండల ఇంచార్జీ కే.భవాని, మాస్టర్ ట్రైనర్ అశోక్, శంకరరావు, రహీంతుల్లఖాన్ మరియు సచివాలయం సెక్రెటరీ లందరూ పాల్గొన్నారు.

వర్గీకరణతో దళితులకు అన్యాయం...

విశాలాంధ్ర-చీపురుపల్లి: సుప్రీంకోర్టు తీర్పుతో ఎస్సీ వర్గీకరణ జరిగితే దళితులకు అన్యాయం జరుగుతుందని ఉత్తరాంధ్ర మాలల కన్వీనర్ పతివాడ రాంబాబు అన్నారు. బుధవారం చీపురుపల్లి లొఉన్న చీపురుపల్లి ప్రెస్‌క్లబ్ దగ్గర ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకరిస్తూ చలో విశాఖపట్నం ఉత్తరాంధ్ర మాలల గర్జన కార్యక్రమం కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ ప్రభుత్వం వచ్చినా వర్గీకరణ పేరుతో దళితులను మోసంచేస్తుందన్నారు. ఉత్తరాంధ్ర మాలల ఆధ్వర్యంలో డిసెంబర్ 8న గురజాడ కళాక్షేత్రంలో మధ్యాహ్నం 2. గంటలకు జరుగునున్న ప్రజా గర్జనకు హాజరుకావాలని ఈ సందర్భంగా దళిత మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంటాన అప్పారావు కోరారు. ఈ సందర్భంగా ఆయన చేతులమీదుగా గోడ పత్రికలను ఆవిష్కరించడం జరిగింది. చీపురుపల్లి నియోజకవర్గం లో ఉన్న ప్రతి మాలపేటలో ఈ కార్యక్రమానికి ఇంటికో మనిషి బయలుదేరాలని ఆయన కోరారు. కార్యక్రమంలో చీపురుపల్లి నియోజకవర్గ మాలల కన్వీనర్ టోంపల. సంజీవరావు ప్రధాన కార్యదర్శి అద్దూరి. కృష్ణ, మాల మహానాడు ఉపాధ్యాయులు బూర. సూర్యనారాయణ, కోశాధికారి బోడసింగి. పోలీస్ కార్యదర్శి దీనిపల్లి. రాము పాల్గొన్నారు.

కుప్పిలి చైతన్య కాంగ్రెస్ పార్టీలో చేరిక



విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: విజయనగరం కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మరిపి విద్యాసాగర్ ఆధ్వర్యంలో కుప్పిలి చైతన్య కుమార్ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. చైతన్య కుమార్ గతంలో టీడీపీ, బిజెపి పార్టీల్లో సేవలు అందించి 2024 లో రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రయత్నించారు. పొత్తులో భాగంగా తెలుగుదేశం పార్టీకి రాజాం నియోజకవర్గం శాసనసభ సీటు ఇవ్వడం వలన చైతన్యకుమార్ 2024లో వేరే పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. కుప్పిలి చైతన్య కుమార్ తో పాటు డాక్టర్ కంచరాపు తిరుపతిరావు, బలివాడ మన్మధరావు, ఇతర కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. చైతన్యకుమార్కి జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజినీరింగ్ కాలేజీలో జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు



విశాలాంధ్ర-గరివిడి: స్థానిక గరివిడి అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ వారోత్సవాల్లో భాగంగా ముందుగా ఫాదర్ అఫ్ లైబ్రరియన్ ఎస్.ఆర్.రంగనాధన్ కు పూలమాలవేసి అనంతరం లైబ్రరియన్ క్రాంతి బి.టెక్,డిప్లమో డిజిటల్ లైబ్రరీ పై అవగాహన కల్పించారు. అలాగే వివిధ విభాగాలకు సంబంధించిన పుస్తకాలు, మ్యాగజైన్స్, కాంపిటేషన్, మోటివేషనల్ తదితర పుస్తకాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువా జయప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి విజ్ఞానాన్ని పెంపుదలకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని తెలుపుతూ,ప్రతి విద్యార్థి కొంత సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బి.వెంకటరమణ,ఏఓ జి.అనిల్ కుమార్,వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాల ముగింపు



విశాలాంధ్ర-జామి: మండల కేంద్రమైన జామిలోని శాఖా గ్రంథాలయంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిసాయి. ముగింపు వేడుకలను గ్రంథాలయ అధికారి స్వామినాయుడు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, పరుగుల పందెం, కథలు రాయడం వంటి పోటీలను నిర్వహించడమే కాకుండా విజేతలుగా నిలిచిన 18మంది విద్యార్థులకు బహు మతులను అందజేసారు. కార్యక్రమానికి హైస్కూల్ ఉపాధ్యాయుడు రమేష్, మండల పరిషత్ పాఠశాల హెచ్ఎం రాజారావు పాల్గొన్నారు.

బాలల హక్కులపై వారికి పూర్తి అవగాహన అవసరం

జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన ఏపీ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : బాలలకు బాలల హక్కులు, విద్యాహక్కు చట్టం, బాల కార్మిక వ్యవస్థ, సామన్యమైన చట్టాలపై పూర్తి అవగహన కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు విద్యా, స్త్రీ శిశు సంక్షేమ అధికారులను కోరారు. బుధవారం కలక్టరేటు ఆడిటోరియం లో బాలల దినోత్సవం, బాలల హక్కుల వారోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని జ్యోతిపజ్వలన చేసి ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలు అందరికీ చదువు ఆరోగ్యంతో పాటు భద్రత ముఖ్యం అన్నారు. బాలలతో పనిచేయుంచుట, బాలల ఆక్రమ రవాణా నేరమన్నారు. బాలికలు లైఫ్ స్కిల్స్ తో పాటు స్వయం రక్షణకు కావలసిన జాగ్రత్తలు తెలుసుకోవాలని కోరారు.

దురల వాట్లకు దూరంగా ఉండాలి: జె.సి. సేతు మాధవన్

జిల్లా జాయింటు కలక్టరు ఎస్ సేతు మాధవన్ మాట్లాడుతూ బాలలు దురలవాట్లు, చెడు స్నేహాలు సోషల్ మీడియా కు దూరంగా ఉండాలనీ ఉపాధ్యాయులు బాలలకు బోధించాలని అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులన్నారు. విద్యార్థులు చిన్నతనం నుండే నైతిక విలువలు నేర్చుకోవాలని, బాల్య దశ నుండే బాలల చట్టలపై పూర్తి అవగహన కల్గి వుండాలని తెలియజేసారు. బాలల హక్కులపై అనర్గళంగా మాట్లాడిన కెజిబివి స్కూల్ విద్యార్థిని రేజేటి పావనికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు డా.హిమబిందు తనకు వచ్చిన బంగారు పథకాన్ని బాలికకు సమావేశంలో బహుకరించి, అభినందించారు. బాలల హక్కుల వారోత్సవాలు నవంబరు 14 నుండి 20 వరకు జరిగిన సందర్భంగా జిల్లాలో 26 కెజిబివి పాఠశాలల విద్యార్ధినీలు బాలల హక్కులపై పోస్టరు మేకింగు, గేమ్స్ ఇవెంట్స్ ఫోటోలలోని విజేతలకు, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్న 11 జెడ్.పి. పాఠశాలల విద్యార్థీనులకు, జిల్లాలోని 11 వివిధ పాఠశాలలకు చేందిన వివిధ జిల్లా/ రాష్ట్ర / జాతీయ పోటీలలో పాల్గొన్న క్రీడాకారిణి విద్యార్థీనులకు సమావేశంలో ఘనంగా సత్కారించి బహుమతులు అందజేసారు. ఈ సమావేశంలో జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ పి.డి. బి.శాంతకుమారి, డిప్యూటి డి.ఇ.ఓ. బి.గౌరి శంకర్, ఐ.సి.డి.ఎస్. అధికారులు, విద్యాశాఖ అధికారులు, బాల కార్మిక వ్యవస్థ అధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థినీలు, బాలలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సత్య డిగ్రీ & పీజీ కళాశాలలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: సత్య డిగ్రీ & పీజీ కళాశాలలో ఎన్ సి సి డే సందర్భంగా విద్యార్థులు, ఎన్ సి సి విభాగాలు కలసిఎం ఆర్ గవర్నమెంట్ హాస్పిటల్ఆధ్వర్యం లో రక్త దాన శిబిరం ఏర్పాటు జరిగింది. ఈ శిబిరం లో 98 మంది విద్యార్థులు రక్తదానం చేసారు. కార్యక్రమంలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశిభూషణ రావు, 2 (ఏ) గర్ల్స్ బెటాలియన్ ఎన్సిసి కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గోపెందర్, సుబేదార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయిదేవ మణి. ఎన్ సి సి ఆఫీసర్లు కెప్టెన్ ఎం సత్యవేణి, ఎం ఉద్దయ్ కిరణ్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి సూరపు నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

జెడ్పీ ఉన్నత పాఠశాల సందర్శించిన జిల్లా విద్యాశాఖ అధికారి

విశాలాంధ్ర-గుర్ల: ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పాఠశాల సబ్జెక్టు సముదాయ సమావేశాన్ని సందర్శించి విద్యార్థులు ప్రతిరోజూ హాజరు అయ్యేటట్లు, చదువు పట్ల ఆసక్తి పెంపొందించే విధంగా చెయ్యాలని, నైపుణ్యాలు మెరుగుపరచి మంచి శాస్త్రవేత్తలుగా ఉన్నత విలువలు గల వ్యక్తులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు అధికారి తెలియచేసారు.

62 సామాజిక మరుగుదొడ్లను పరిశుభ్రపరిచిన ప్రజారోగ్య సిబ్బంది

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : ప్రపంచ మరుగుదొడ్ల వారోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో ఉన్న 62 సామాజిక మరుగుదొడ్లను ప్రజారోగ్య సిబ్బంది పరిశుభ్రపరిచారు. మరుగుదొడ్లతో పాటు పరిసర ప్రాంతాలను కూడా శుభ్రపరిచారు. మరుగుదొడ్ల ఆవశ్యకత పట్ల ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు ప్రపంచవ్యాప్తంగా కృషి జరుగుతోంది. ఇందులో భాగంగా మరుగుదొడ్ల వల్ల ఉపయోగాలు, వాటిని అపరిశుభ్రంగా ఉంచినట్లయితే సంక్రమించే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అందువలన ప్రతి ఒక్కరూ సామాజిక మరుగుదొడ్లను తోపాటు వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరుతున్నారు. కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రజారోగ్య సిబ్బంది నగరంలో ఉన్న అన్ని సామాజిక మరుగుదొడ్లను పరిశుభ్రపరిచి ప్రజా వినియోగంలోకి తీసుకువచ్చారు.

వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసిన లైబ్రరీయన్ స్వర్ణకుమారి

విశాలాంధ్ర-బొబ్బిలి: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శాఖా గ్రంథాలయం బొబ్బిలి ముగింపు సమావేశం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి నవంబర్ 14 నుండి 20 తేదీ వరకు వివిధ రకమైన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ ద్వితీయ బహుమతులను శాఖ గ్రంథాలయం లైబ్రరీన్ స్వర్ణ కుమారి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారు.

వైభవంగా సూర్యదేవునికి కళ్యాణం

విశాలాంధ్ర-శృంగవరపుకోట టౌన్: మండల కేంద్రంలో ఉన్న సూర్య దేవాలయంలో బుధవారం శ్రీ యాజ్ఞవాలక జయంతి సందర్భంగా ఆలయ 41 వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ సూర్యదేవుని కళ్యాణాన్ని కనుల పండుగ నిర్వహిం చారు. ఆలయ ధర్మకర్త ముక్కుజానకి బాయ్ ఆధ్వర్యంలో కుటుం బాలు కళ్యాణకర్తలుగా గార్లపాటి సత్యసాయి దంపతులు.. పట్నాల ప్రసాద రావు దంపతులు.. కొచ్చర్లకోట రాజేష్ దంపతులు.. మంత్రి ప్రగడ పనింద్ర దంపతులు స్వామివారి కళ్యాణాన్ని నిర్వహించారు. ఈ కళ్యాణంలో అర్చకులు వెన్నకోట సూరిబాబు శర్మ చిటిశాస్త్రి శర్మ అయ్యప్ప శర్మ కుమార్ శర్మ విన్నకోట శంకర్రావు తదితరులు పాల్గొని పూజలను నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేసి 1500 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు ముకుంద, ప్రకాష్,బ్రాహ్మణ సంఘ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ ఉమా రామలింగేశ్వరాలాయం లో క్షీరాభిషేకం



విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : కార్తీక మాసోత్సవాలు పట్టణంలోని శివాలయం వీధి పురాతన శ్రీ ఉమా రామలింగేశ్వరాలాయం లో శ్రీ పైడితల్లి అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి.ఈసందర్భంగా బుధవారం భక్తులు తెల్లవారు జామునుండి ఆలయానికి విచ్చేసి శ్రీ స్వామి వారికి క్షీరాభిషేకం నిర్వహిం చుకున్నారు.ఆలయంలో కొలువైన శ్రీ సర్వకామదాంబ అమ్మవారికి కుంకు మార్చనలు నిర్వహించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమం లో భాగంగా శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థ కళాకారులు ఎం.భీష్మారావు సంగీత సారథ్యం లో ఆధ్యాత్మిక భక్తి సంగీత కీర్తనలు, శివనామ సంకీర్తనలతో శ్రీ స్వామి వారికి స్వరార్చనలుచేసారు.

14 సంవత్సరాలలోపు ఉన్న ప్రతి బాల బాలికలు విధిగా స్కూల్లో ఉండాలి

గవర్నమెంట్ మహారాజా సంస్కృత ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా గవర్నమెంట్ మహారాజా సంస్కృత ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టీవీ రాజేష్‌కుమార్ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు, 14 సంవత్సరాలలోపు ఉన్న ప్రతి ఒక్క బాల బాలికలు విధిగా స్కూల్లో ఉండాలని వారు తెలియజేశారు 14 సంవత్సరాల బాలబాలికలకు ప్రభుత్వం ఉచిత నిర్బంధ విద్య అందిస్తుందని తెలియజేశారు. బాలల హక్కులు, బాలల యొక్క బాధ్యతలు ,నైతిక విలువలు గురించి తెలియజేశారు, విద్యాహక్కు చట్టం, బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణా గురించి, బాల్య వివాహా లు చట్ట విరుద్ధమని తెలియజేశారు. ముఖ్యంగా బాలికలను ఉద్దేశించి ప్రస్తుత రోజుల్లో బాలికలు చాలా జాగ్రత్తగా ఉండాలని వారి పట్ల ఎవరైనా అనుచితంగా గాని అసభ్యంగా గాని ప్రవర్తించిన యెడల ముందుగా తల్లిదండ్రులకు మరియు క్లాస్ టీచర్కు తెలియజేయాలని సూచించారు మరియు బాలల హక్కులను కాపాడడానికి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఎప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు. విద్యార్థులకు బాల్య దశ నుంచే రాజ్యాంగం పట్ల కొన్ని సామాన్యమైన చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు 18 సంవత్సరాల లోపు పిల్లలు టూ వీలర్ నడపకూడదని అలా చేసినట్లయితే ప్రమాదాలు జరుగుతాయి అందుకుగాను తల్లిదండ్రులకు శిక్ష పడుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. విద్యార్థులు చిన్నతనం నుంచే తల్లిదండ్రుల పట్ల ఉపాధ్యాయుల పట్ల గౌరవంతో మెలగాలని నైతిక విలువలు నేర్చుకోవాలని తెలియజేశారు. అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా స్కూలులో ఎస్సే రైటింగ్ కాంపిటీషన్ లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి పి.బి.రాజు పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు టి లలిత కుమారి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహారాజ ప్రభుత్వ సంస్కృత కళాశాలలో ఘనంగా గ్రంథాలయ ముగింపు వారోత్సవాలు

విశాలాంధ్ర -విజయనగరం టౌన్ : స్థానిక మహారాజ ప్రభుత్వ సంస్కృత కళాశాలలో 57వ గ్రంథాలయ వారోత్సవాలలో బాగంగా ఈనెల 14 నుండి 20 వరకు వరకు గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డా. జి. జనార్ధన నాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గ్రంథాలయాలు ప్రతిభావంతులైన విద్యార్థులుగా తయారు చేస్తాయన్నారు. విద్యార్థులు అందరూ తమ విరామ సమయములో గ్రంథాలయాలు ను వినియోగించుకొని,తమ జ్ఞానాన్ని పెంచుకొని తమ భవిష్యత్తు ను తీర్చిదిద్దుకోవాలన్నారు. నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా వెబ్సైట్ లో విలువైన పుస్తకాలు ఉన్నాయని వాటిని డౌన్లోడ్ చేసుకొని వినియోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల గ్రందాలయాధికారి పి.గౌరీ శ్వర రావు, ఇతర అధ్యాపకులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేయడం జరిగింది.

ఆదిత్య డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: పట్టణంలో ఉన్న ఆదిత్య డిగ్రీ కళాశాలలో బుధవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు దీనికి ముఖ్యఅతిథిగా మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ డి వి జి శంకర్రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రంథాలయాల ఆవశ్యకతను నేటి తరానికి కావలసిన డిజిటల్ లైబ్రరీల గురించి వివరించారు. అలాగే అబ్దుల్ కలాం తో పనిచేసిన అనుభవాలను విద్యార్థులకు వివరించారు అనంతరం కళాశాల ప్రిన్సిపల్ బి దామోదర్ రావు మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో ఉన్న గ్రంథాలయాన్ని వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సమన్వయకర్త సామాజిక కార్యకర్త అబ్దుల్ రవూఫ్ ,కళాశాల వైస్ ప్రిన్సిపల్ వివిఎల్ నరసింహారావు ఎన్ఎస్ఎస్ పీవోలు కళాశాల లైబ్రరీ ఆర్ వేణుగోపాలరావు,టి శివ తదితరులు పాల్గొన్నారు

కార్యకర్తల అభివృద్ధికి టీడీపీ కృషి

టీడీపీ మండల అధ్యక్షుడు మహేశ్వరరావు

విశాలాంధ్ర-గుర్ల: మండలంలో జమ్మూపేట గ్రామంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఐటీడీపి అధ్యక్షులు.నాగులవల్లి నారాయణరావు పర్యవేక్షణ లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు గురించి వివరించి సభ్యత్వ నమోదు చేయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ స్థాయి టీడీపీ నాయకులు కురిమినెల్లి నారాయణస్వామి నాయుడు మహంతి ఆదినారాయణ. చందాక ఆనంద్. చందాక సత్యనారాయణ. కురిమినెల్లి శ్రీను. జమ్ము సూరిసత్యం తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగు నీటి సమస్యకు సత్వర పరిష్కారం..

విశాలాంధ్ర-తెర్లాం: మండలం లో పెరుమాళి గ్రామ పంచాయతీ పెరుమాలి గ్రామంలో ఉన్న మూడు అంగన్వాడి సెంటర్‌లలో ఎప్పటినుంచో ఉన్న తాగునీటి సమస్యను పంచాయితీ సర్పంచ్ ప్రతిని అప్పచ్చిరాజు, పంచాయితీ కార్యదర్శి వెంకటి దృష్టికి అంగన్వాడి సిబ్బంది తీసుకువెళ్ళారు. ఈ మేరకు బుధవారం హ్యాండ్ బోర్ వేసి తాగు నీటి సమస్యకు సత్వర పరిష్కారం చూపారు. ఇందుకు గాను అంగన్వాడి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

పోలిపల్లి పైడితల్లి అమ్మవారి హుండీ ఆదాయం రూ.1.23 లక్షలు

విశాలాంధ్ర-రాజాం: స్థానిక శ్రీ పోలిపల్లి పైడితల్లి అమ్మవారి దేవాలయంలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది. ఈవో మాధవరావు ఆధ్వర్యం లో జరిగిన లెక్కింపునకు ప్రత్యేకాధికారిగా నవదుర్గ అమ్మవారి ఆలయం ఈవో శ్యామలరావు హాజరయ్యారు. 42 రోజులకు జరిగిన లెక్కింపు ద్వారా రూ.1,23,794 ఆదాయం వచ్చిందని వెల్లడించారు. ఈ లెక్కింపులో ఆలయ అనువంశిక ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్, అర్చకులు వేమకోటి సూర్యనారాయణ, స్థానికులు పాల్గొన్నారు.

బాడంగి గ్రంథాలయంలో ఘనంగా గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుక

విశాలాంధ్ర-బాడంగి: విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ శ్రీకార్యదర్శి వారి ఆదేశాలు మేరకు బాడంగి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఆర్. దుర్గా ప్రసాద్ మరియు పింద్రంగి వలస ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. రవిబాబు ఆధ్వర్యంలో57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నవంబర్ 14 నుండి నవంబర్ 20 వరకు మొత్తం వారం రోజులు పాటు వివిధ కార్యక్రమాలు, అనగా గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభోత్సవ కార్యక్రమం,బాలల దినోత్సవం కార్యక్రమం, పుస్తక ప్రదర్శన కార్యక్రమం అలాగే నేటి యువత పై మాదక ద్రవ్యాల ప్రభావం అంశం పై అవగాహన సదస్సు, గ్రంథాలయ ఉద్యమ నాయకులు స్మరించుకొని వారి సేవలను గుర్తుకు తెచ్చుకోవడం కార్యక్రమం అదేవిధంగా మహిళలని చైతన్య పరిచే కార్యక్రమాలు మరియు విద్యార్థినీ విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్, వకృత్వం, ఆటలు పోటీలు నిర్వహించడం జరిగింది అందులో గెలుపొందిన విజేతలకు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మార్వో సుధాకర,, ఎండిఓ రామకృష్ణ, ఎస్సై తారకేశ్వరరావు, , కాలేజ్ ప్రిన్సిపాల్ గారు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోషల్. వెల్ఫేర్ స్కూల్ ప్రిన్సిపాల్ చేతులు మీదగా బహుమతుల ప్రధానం చేయడం జరిగింది.ముందుగా సరస్వతి చిత్ర పటానికి పూలమాలతో అలంకరించి జ్యోతీ ప్రజ్వలన గావించి తదుపరి విద్యార్థినీ, విద్యార్థులనీ, గ్రంథాలయ పాఠకులని, పోటీ పరీక్షలకు చదువుకొనే నిరుద్యోగ యువతకు ఉద్దేశించి ముందుగా బాడంగి జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 57వ జాతీయ గ్రంథాలయాల ముఖ్య ఉద్దేశం చిన్న పిల్లలు దగ్గర నుండి పెద్దవాళ్ళ వరకు అందరికీ గ్రంథాలయాలను వినియోగించుకోవాలి అని చెపుతూ గ్రంథాలయ వాతావరణం మీకు ఉన్నత విలువలు ఆలోచనలతో పాటు అక్కడ ఉండే పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకుని ఉన్నత లక్ష్యాలను సాధించడానికి ఒక మార్గనిర్దేశాన్ని చూపించే ఒక మంచి గురువు అని సందేశం ఇచ్చారు. పుస్తకాలు చదవడం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. తదుపరి బాడంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారు మాట్లాడుతూ మ బాడంగి గ్రంథాలయాన్ని సందర్శించి అక్కడ ఉన్న పుస్తకాలు సౌకర్యాలనుచూసి చాలా సంతోషించాను అని చెపుతూ తమ జీవితంలో పోటీ పరీక్షలకు కావచ్చు లేదా ఉన్నత చదువుల కోసం కావచ్చు పుస్తకాలు చదవడం కోసం వాటి కోసం మేము చాలా ఇబ్బంది పడేవాళ్ళం మేము గ్రంథాలయంలో చదువుకోవానికి ప్లేస్ కోసం మీకు గ్రంథాలయం తెరవడానికి ఒక గంట ముందే వెళ్ళి లైన్ లో ఉండే వాళ్ళం అప్పుడు అలాంటి పోటీ ఉండేది ఇప్పుడు అలాంటి ఇబ్బంది లేకుండా మీకు మన బాడంగి గ్రంథాలయంలో అన్నీ సౌకర్యాలు కల్పిస్తూ, అంతర్జాల సౌకర్యం కూడా కల్పించారు కావున విద్యార్థులందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బాడంగి శాఖా గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి దుర్గాప్రసాద్ సేవలను కొనియాడారు. సోషల్ వెల్ఫేర్ కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తన జీవితంలో ఎం.ఫిల్ చదువుతున్న సమయంలో గ్రంథాలయం లో ఉండే పుస్తకాల కోసం చాలా ఇబ్బంది పడ్డానని, గ్రంథాలయ సహకారంతోనే నా విద్యను పూర్తి చేయగాలిగాను అని విద్యార్థులకు చెప్పారు. అనంతరం ఈ వేదిక పై ఉన్న ఎంపిడిఓ కూడా ఒకప్పుడు నా దగ్గర విద్యా బుద్ధులు నేర్చుకున్న వారేనని మీరు కూడా అలా ఉన్నత స్థానాలకు చేరాలని విద్యార్థులను కోరారు.

రాజాం పోలీసు స్టేషను సందర్శించిన ఎస్పీ వకుల్ జిందల్

పోలీసు స్టేషను పరిసరాలు, ప్రాపర్టీ రూం, లాకప్ సెల్స్, సీజ్డ్ వాహనాలను పరిశీలన

విశాలాంధ్ర-రాజాం : వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ నవంబరు 20న రాజాం పోలీసు స్టేషను సంద ర్శించి, స్టేషను పరిసరాలు, లాకప్ సెల్స్, ప్రాపర్టీ రూం పరిశీలించారు. స్టేషన్ ప్రాంగణంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మొక్కను నాటారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ - పోలీసు స్టేషను ప్రాంగణంలో సీజ్ చేసి ఉన్న ద్విచక్ర మరియు ఇతర వాహనాలను పరిశీలించి, ఏ నేరంలో ఏ తరహా వాహనాలను సీజ్ చేసినది, అధికారులను అడిగి తెలుసుకున్నారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను సాధ్యమైనంత వరకు డిస్పోస్ చేసే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు.పోలీసు సిబ్బందితో మాట్లాడి వారికి దత్తతగా అప్పగించిన గ్రామాలను వారంలో ఒకసారి విధిగా సందర్శించాలని, గ్రామంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, భూతగదాలు, గొడవలు, వివిధ రాజకీయ పార్టీల వైరంలు, పాత నేరస్తులు, హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తుల, గంజాయి రవాణా, విక్రయాలు, వినియోగం గురించి సమాచారం సేకరించి, ఉన్నతాధికారులకు అందజేయాలన్నారు. పోలీసు సిబ్బందితో జిల్లా ఎస్పీ మమేకమై, వారి సమస్యలను అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. గంజాయి నియంత్రణకు చర్యలు చేపట్టాలని, మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలను ప్రజలు, విద్యార్థులకు "సంకల్పం" కార్యక్రమంతో అవగాహన కల్పించాలని ఆదేశించారు. గంజాయి కేసుల్లో ప్రధాన సూత్రధారులను అరెస్టు చేసి, మూలాలను సమూలంగా గుర్తించి, చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్రీయ రహదారి పై ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. బ్లాక్ స్పాట్స్ వద్ద కాషనరి బోర్డులను, స్థాపర్స్, లైటింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అనంతరం, పోలీసు స్టేషనులో నమోదై, దర్యాప్తులో ఉన్న కేసులు, వివిధ న్యాయ స్థానాల్లో ట్రయల్స్ లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల సిడీ ఫైల్సను జిల్లా ఎస్పీ పరిశీలించి, కేసుల దర్యాప్తు పూర్తి చేసేందుకు అధికారులకు దిశా నిర్దేశం చేసారు. కేసుల్లో నిందితులు శిక్షింపబడే విధంగా సాక్ష్యాలను, సాంకేతిక ఆధారాలను సేకరించి, దర్యాప్తు పూర్తిచేయాలన్నారు. గ్రామస్థాయిలో గంజా యి విక్రయాలు, వినియోగం, రవాణా చేసున్న వారి సమాచారం సేకరించి, వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన నిందితులు శిక్షింపబడే విధంగా సాక్ష్యాలు, సాంకేతిక ఆధారాలు సేకరించి, కోర్టులో ప్రవేశ పెట్టాలన్నారు. స్టేషను పరిధిలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నేరాల నియంత్రణకు ఇన్ఫార్మర్ వ్యవస్థను మెరుగుపర్చుకోవాలని, సమాచార సేకరణకు ఎంఎస్పి, దత్తత గ్రామ పోలీసుల సేవలను సమర్ధవంతంగా వినియోగించుకోవాలన్నారు.సైబరు మోసాలు జరగకుండా చూడాలని, ప్రజలకు సైబరు మోసాలు, డిజిటల్ అరెస్టు, ఏటీఎం మోసాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, సైబరు మోసానికి గురైతే 1930 కు లేదా సైబరు క్రైమ్ పోర్టల్ లో ఫిర్యాదు నమోదు అయ్యే విధంగా చూడాలని, బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ అయిన నగదు బాధితులకు అందే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు.దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలను, మహిళల భద్రతకు, గంజాయి రవాణా నియంత్రణకు పోలీసులు చేపడుతున్న చర్యలను రాజాం సిఐ అశోక్ కుమార్ జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ గార్కి వివరించారు.అనంతరం, చెవిటి, మూగ పిల్లలకు నూతన వస్త్రాలను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అందజేశారు. రాజాం పట్టణంలో పోలీసు క్వార్టర్స్ పడగొట్టిన ఖాళీ స్థలాన్ని ఎస్పీ వకుల్ జిందల్ పరిశీలించి, ఖాళీ స్థలాన్ని పోలీసుశాఖ తిరిగి వినియోగించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో చీపురుపల్లి డిఎస్పీ ఎస్.రాఘవులు, రాజాం సిఐ కే.అశోక్ కుమార్, ఎస్బి సిఐ ఎవి లీలారావు, రాజాం రూరల్ సిఐ హెచ్.ఉపేంద్రరావు, ఎస్ఐ రవి కిరణ్ మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలపై దాడులు

ప్రజారోగ్య అధికారి డాక్టర్ సాంబమూర్తి

విశాలాంధ్ర -విజయనగరం అర్బన్: విజయనగర పరిధిలో నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలపై దాడులు నిర్వహించిన ప్రజారోగ్య బృందం 350 కేజీల ప్లాస్టిక్ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి బృందం పిడబ్ల్యు మార్కెట్లో బుధవారం వివిధ ప్లాస్టిక్ విక్రయాల దుకాణాలపై దాడులు నిర్వహించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నగరంలో ఒకసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినట్లు ప్రజారోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి తెలిపారు. అయితే ఎన్నిసార్లు ఉన్నతాధికారులు హెచ్చరించినా ప్లాస్టిక్ విక్రయ దారులలో మార్పు రావడం లేదన్నారు. ఈ మధ్యనే 560 కేజీల ప్లాస్టిక్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని, మరల పిడబ్ల్యు మార్కెట్లో కొందరు నిషేధిత ప్లాస్టిక్ ను విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో దాడులు చేపట్టామన్నారు. అలాగే ప్రజలు కూడా క్యారీ బ్యాగులు కాకుండా గుడ్డ సంచులు వినియోగించుకోవాలని సూచించారు. ఇకపై నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు సాగిస్తే భారీ అపరాధ రుసుములతో పాటు దుకాణాలను కూడా సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

గిరిజన వర్సిటీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

విశాలాంధ్ర-మెంటాడ: రాష్ట్ర విభజన చట్టంలోని గిరిజన యూనివర్సిటీ నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగింది. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా దీని స్థలాన్ని మార్చడంతో నేటికీ మెంటాడ మండలం కుంటినవలస వద్ద నిర్మాణ ప్రారంభ దశలోనే ఉంది. బుధవారం కుంటినవలస గిరిజన యూనివర్సిటీ స్థలాన్ని, నిర్మాణ దశలో భవనాలను ప్రజాసంఘాల ప్రతినిధులు పరిశీలించారు. మెంటాడ మండలంలో కాకుండా నేడు మరలా దీన్ని కొత్తవలస మండలం రెల్లివద్ద అప్పుడు సేకరించిన స్థలంలోనే నిర్మిస్తా మని ఈ నెల 13న రాష్ట్ర అసెంబ్లీలో మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ తెలి పారని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎం అజశర్మ పేర్కొన్నారు.దీనివల్ల ఇది మరింత ఆలస్యం అవుతుంది. గత ప్రభుత్వం రెల్లి నుండి ఇక్కడకు మార్చింది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఇలా స్థలాలు మార్చుకోవడం భావ్యం కాదు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న దీన్ని మార్చడం సరి కాదు. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కేంద్ర విద్యా శాఖ మంత్రికి, రాష్ట్ర ప్రభుత్వానికి మెంటాడలోనే ఇంకే మాత్రం జాప్యం చేయకుండా దీన్ని నిర్మించాలని లేఖలు రాసాం. గిరిజనులకు 50శాతం సీట్లు కేటాయించేలా చట్టబద్ధ ఏర్పాటు చేయాలని కూడా ఆ లేఖలో కోరాం. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్‌ని కలిసి చర్చించింది. ఎస్టీ అసెంబ్లీ నియోజకవర్గం సాలూరులో భాగంగాఉన్న మెంటాడ మండలంలోని కుంటినవలస గ్రామం వద్ద వర్సిటీ నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన 2025లోగా పూర్తి చేయాలని,శాశ్వత సిబ్బంది నియమించి,అన్ని కోర్సులను అందుబాటులోకి తేవాలని,గిరిజనులకు 50శాతం సీట్లు కేటాయించేలా చట్టబద్ధత ఏర్పాటుచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఈ దేశంలో రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కార్యక్రమం లోఆర్గనైజింగ్ కార్యదర్శి ఎంఎస్ వాసా, ఉపాధ్యక్షులు కె. విజయగౌరి, గిరిజన సంఘం విజయనగరం జిల్లా కార్యదర్శి టి. సోములు, మన్యం జిల్లా కార్యదర్శి సీదరి అప్పారావు, వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాము,జగదీష్, రవికుమార్, కాంతారావు, సర్పంచి రమేష్ నాయుడు, వెంకటరావు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలి

బహుజన్ సమాజ్ పార్టీ డిమాండ్

విశాలాంధ్ర-చీపురుపల్లి : విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ చేయడాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలుపుదల చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా ఇన్చార్జ్ ఆర్ జి శివప్రసాద్, చీపురుపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ సబ్బి సత్యనారాయణ, బుధవారం నాడు చీపురుపల్లి ప్రెస్ క్లబ్ వద్ద విలేకరులతో మాట్లాడారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో 1966లో దళితుడైన తవణంపల్లి అమృత రావు విశాఖపట్నంలో ఆమరణ నిరాహారదీక్షతో ప్రారంభించిన ఉద్యమం నేడు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమంగా మారిందన్నారు. అప్పటి ఉద్యమంలో అప్పటి ప్రభుత్వ పాలనలో జరిపిన కాల్పులకు 32 మంది అమరులయ్యారన్నారు. పరిపాలనకు వచ్చిన ప్రాంతీయ పార్టీలన్నీ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మనియమంటారు కార్మికులకు హామీలు ఇస్తున్నారే తప్ప కేంద్ర ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్లడం లేదని వారు ఆరోపించారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సైల్ లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఉక్కు కర్మాగారం పూర్తి సామర్థ్యం తో పనిచేసే విధంగా అన్ని వనరులు సమకూర్చాలన్నారు. పదవీ విరమణ చేసిన వారి స్థానములో కొత్త ఉద్యోగులను నియమించడంతోపాటు నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం యాజమాన్యం యొక్క వేధింపులు కూడా ఉద్యోగుల పైన నిలుపుదల చేయాలన్నారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా విశాఖ ఉక్కు కర్మాగారం పై ఆధారపడి జీవిస్తున్న లక్షలాదిమంది బహుజనులు బజారున పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉక్కు ఫ్యాక్టరీని అమ్మాలన్న స్వార్థబుద్ధిని కేంద్ర ప్రభుత్వం విడనాడాలన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణలో తెలుగు ప్రజలంతా ఐక్యమై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నడుపుతున్న పార్టీలకు తగిన సమయంలో బుద్ధి చెప్పాలని సూచించారు. ఈ మేరకు డిసెంబర్ 1న విశాఖపట్నంలో జరుగుతున్న బహుజన ధర్నా కార్యక్రమంనకు బహుజన అంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమమునకు భోజనం పార్టీ ఆంధ్రప్రదేశ్ ఇంచార్జ్ రాజ్యసభ సభ్యులు రాంజీ గౌతం హాజరుకానున్నారని ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ చీపురుపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ సబ్బి సత్యనారాయణ, చీపురుపల్లి మండల అధ్యక్షులు కే గౌరీ శంకర్, డెంకాడ మండల అధ్యక్షులు బివి నరసింహులు తదితరులు హాజరయ్యారు.